05ATP21_05ATP21.qxd 21-04-2025 PM 10:23 Page 1



## పిఎం అజయ్ రుణాల మంజూరు చెక్కు పంపిణీ



చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

పిఎం అజయ్ రుణాల మంజూరు చెక్కును ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి సోమవారం స్థానిక కార్యాలయంలో పంపిణీ చేశారు. తాడిపత్రి నియోజకవర్గం పరిధిలోని 8 మంది సభ్యులకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పిఎం అజయ్ రుణాల మంజూరు చెక్కును ఎమ్మెల్యే జె.సి వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన చిన్నారులు

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తెలియచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడిపత్రి ప్రాజెక్ట్ ఆసుపత్రిపాలెం సెక్టార్‌కు సంబందించిన అంగన్‌వాడి సెంటర్లు, శ్రీనివాసపురం-1, 2, సిపిఐ-2, పీర్లమాన్యం సెంటర్లలో వుండే 5 సంవత్సరల పిల్లలు 20 మందిని శ్రీనివాసపురంలో వుండే ప్రభుత్వ పాఠశాలకు, అంగన్‌వాడిలో వున్న పిల్లలును 1వ తరగతికి చేర్చడం జరిగిందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని తల్లితండ్రులుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జ్ జనార్ధన్, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## విశేష అలంకరణలో శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**



తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి సోమవారం విశేష అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో పాటు వెండిముఖ కవచంతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజ రాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, కమిటీ సభ్యులు చంద్రమోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఅశ్వత్థనారాయణస్వామికి వెండి కలశాలు వితరణ

**పెద్దపప్పూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**



స్వామివారికి వెండి కలశాలు అందచేస్తున్న దృశ్యం

మండలంలోని చిన్న పప్పూరు సమీపంలోని పెన్నా నది తీరాన వెలసిన శ్రీఅశ్వత్థ నారాయణస్వామికి బిజెపి జిల్లా చేనేత అధ్యక్షులు నారాయణస్వామి కిలో వెండి కలశాలను వితరణ చేశారు. నారాయణస్వామి తమ పెళ్లిరోజును పురస్కరించుకుని సోమవారం శ్రీఅశ్వత్థ నారాయణస్వామి, శ్రీచక్రభీమి లింగేశ్వరస్వామిని దర్శించుకుని కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి కిలో వెండితో తయారు చేయించిన 4 కలశాలను ఆలయ కమిటీ వారికి అందచేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన మొక్కజొన్న పంట



కాలిపోయిన మొక్కజొన్న పంట

**పుట్లూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

మండలంలోని వెల్లుట్ల గ్రామంలో రైతు గొర్ల మారుతీనాయుడుకు సంబందించిన తోటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం వల్ల చేతికి వచ్చిన మొక్కజొన్న పంట కాలిపోయింది. ఈ సంఘటనలో దాదాపు 4 ఎకరాలు మొక్కజొన్న పంట , డ్రిప్ పరికరాలు, పైపులైన్‌కు సంబంధించి 30 పివిసి పైపులు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలియచేశాడు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**పుట్లూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

మండలంలోని గాండ్లపాడు గ్రామ శివార్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు 2 రోజుల క్రితం మృతిచెందినట్లు కనిపిస్తోంది. వ్యక్తి పిడుగుపాటుకు గురై మృతి చెంది వుంటాడని స్థానిక ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలానికి సిఐ సత్యబాబు, ఎస్.ఐ.వెంకటనరసింహం చేరుకొని పరిశీలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన జె.సి



క్రీడాకారులతో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటి సంస్థలు సంయుక్తంగా నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భార్గవ్, సాధక్‌లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 జట్లు తెలపడనున్నాయి. ప్రారంభ మ్యాచ్ తాడిపత్రి సలార్ జట్టు, అనంతపురం జిఎన్‌జి జట్లు తలపడ్డాయి. ఈ సందర్భంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రౌండ్‌కు పంపించే ప్రతి క్రీడాకారుల తల్లిదండ్రులు దేవుడితో సమానమన్నారు. ప్రస్తుత కాలంలో చిన్న వయసులో ఏదో ఒక రోగం బారిన పడుతున్న సంఘటనలు మనం చూస్తూనే వున్నామన్నారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కావునా ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. టాస్ గెలిచిన తాడిపత్రి సలార్ జట్టు, అనంతరం జట్టును బ్యాటింగ్ ఆహ్వానించింది. అనంతపురం జట్టు 20 ఓవర్లలో 240 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సలార్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 149 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో విఘ్నేశ్వర, బత్తలపల్లి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విఘ్నేశ్వర జట్టు 181 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బత్తలపల్లి జట్టు 18 ఓవర్లలో 121 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

## ఆలయం వద్ద అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**పుట్లూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 79 సోమవారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, ఎంవి సుబ్బయ్య, ములి హరినాథ్‌రెడ్డి, భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**కదిరి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

ఇంటి నివేశ స్థలాలు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇవ్వాలని సీపిఎం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇంటి నివేశ స్థలాలు లేని నిరుపేదలతో కలిసి స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జీఎల్ నరసింహులు, సాంబశివుడు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వడంతోపాటు పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని లేని పక్షంలో ఈ నెల 26న సీపిఎం పార్టీ ఆధ్వర్యంలో అన్ని తహశీల్దారు కార్యాలయాల ఎదుట రిలే దీక్షలకు పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, ముస్తక్, నారాయణలు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం సవరణను వ్యతిరేకిస్తూ....

## ముస్లీం సోదరుల భారీ ప్రతిఘటన




ముస్లీం సోదరుల ప్రతిఘటనకు మద్దతు తెలిపి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యేలు నాగేంద్ర, భరత్‌రెడ్డి, ఎంపీ డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్‌లు

**బళ్లారి, ఏప్రిల్21, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం వక్ ్ఫ చట్టానికి సవరణ చేస్తూ పార్లమెంటులో ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ నగరంలో వేలాది మంది ముస్లీం సోదరులు భారీ ప్రతిఘటన చేపట్టారు. నగరంలోని వివిధ వార్డుల నుంచి వేలాది మందిగా తరలివచ్చిన ముస్లీం సోదరులు జాతీయ జెండాలను చేత పట్టుకుని రాజ్యాంగం రక్షించండి.... వక్ ్ఫ చట్టాన్ని కాపాడండి అనే నినాదాలు రాసిన ప్లకార్డులు చేతపట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మోతీ సర్కిల్‌లో చేరుకుని వారు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆల్ ఇండియా ముస్లీం పర్సనల్ లా బోర్డు బళ్లారి జిల్లా శాఖ నేతృత్వంలో జరిగిన ప్రతిఘటనలో స్థానిక సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు హుమయూన్‌ఖాన్ తదితర కాంగ్రెస్ నాయకులు ఈ ప్రదర్శనలో పాల్గొని ముస్లీం సోదరులకు తమ మద్దతు తెలిపారు. నగరంలోని ప్రముఖ మసీదుల నుంచి కూడా ముజావర్ల నేతృత్వంలో ముస్లీం సంఘ సంస్థలకు చెందిన వందలాది మంది పదాధికారులు, సభ్యులు మోతీ సర్కిల్‌కు చేరుకుని ప్రతిఘటనలో పాల్గొన్నారు.



## అంగన్‌వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పుట్లూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

పుట్లూరు-3 అంగన్వాడి కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఇఒ శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పిసి శాంతమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వెయ్యి రోజుల సంరక్షణ గురించి గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారము గురించి వివరించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడి టీచర్లు పోషకాహార వంటలతో ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె రాధ, పుట్లూరు సెక్టార్‌లోని 22మంది అంగన్‌వాడి టీచర్లు, గర్భవతులు, బాలింతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నో ఏళ్లకల ఫలిస్తున్న వేళ

**-ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో శాశ్వత నీటిపరిష్కారం**

**- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు**

**పుట్లూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

ఎన్నో ఏళ్ళ తరపడి ఎదురుచూస్తున్న క"నీటి"కష్టాలు తీరుతుండడంతో ఆ గ్రామప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాల్లో నిరంతరం తాగునీటి సమస్య తలెత్తుతుండడంతో నీటి కష్టాలు తప్పేవికాదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తాత్కాలిక పరిష్కారం తప్పా శాశ్వత పరిష్కారం చూపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ గ్రామసర్పంచు శివరామయ్య తాగునీటి కొరతపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి తెలియచేసారు. తక్షణమే సంబంధిత అధికారులతో సమీక్ష చేసి గండికోట రిజర్వాయర్ నీటిని అందిస్తే శాశ్వత పరిష్కారం అందుతుందని భావించి, తాడిపత్రి మండలంలోని దిగువపల్లి గ్రామంలో వున్న సంపు నుండి ఆ రెండు గ్రామాలకు పైపులైన్ పనులను ప్రారంభించారు. కాగా ఆయా పనులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి వాగులు, వంకలు పారినా ఈ గ్రామాల్లో తాగునీటి కొరత తప్పడంలేదన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని శాశ్వత పరిష్కారం కోసం గండికోట రిజర్వాయర్ నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. దీంతో ఆ గ్రామాలకు త్వరలో నీటిసమస్య తీరుతున్నందుకు చాలా గర్వపడుతున్నానన్నారు. పనులను పూర్తి చేయించిన సర్పంచు శివరామయ్యను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కులశేఖర్‌రెడ్డి, సర్పంచు శివరామయ్య, సుదర్శన్‌నాయుడు, బాలరంగయ్య, బ్రహ్మయ్య, శివకుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందచేసిన దృశ్యం

**పుట్లూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

పుట్లూరు గ్రంథాలయానికి బాలాపురం పంచాయతీ కార్యదర్శి పి.వెంకట్‌నాయుడు దాదాపు 150 పుస్తకాలను సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా వెంకట్‌నాయుడు మాట్లాడుతూ ఉద్యోగ పోటీ పరీక్షలైన గ్రూప్-1, గ్రూప్-2, ఎస్ఐ, డిఎస్‌పి తదితర ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారికి ఈ పుస్తకాలు ఉపయోగపడతాయన్న ఉద్దేశ్యంతో తనవంతుగా గ్రంథాలయానికి పుస్తకాలను అందచేయడం జరిగిందన్నారు. ఈ పుస్తకాలను నిరుద్యోగ యువతీ యువకులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అదేవిధంగా గ్రంథాలయ అధికారి జయరాములు మాట్లాడుతూ పేద విద్యార్థినీ విద్యార్థులకు. నిరుద్యోగులకు ఉపయోగపడే పుస్తకాలను అందచేయడం పట్ల పంచాయతీ కార్యదర్శి పి.వెంకట్‌నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రైతుల రుణాలను వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలి



రైతుల రుణాలు వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలని బ్యాంకు ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

రైతుల రుణాలను అసలు లేకుండా వడ్డీతో రెన్యువల్ చేయాలి ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కందుకూరు కెనరా బ్యాంకు నందు ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున జిల్లా ఉపాధ్యక్షుడు పి రామకృష్ణ రైతు సంఘం నాయకులు పుల్లారెడ్డి శ్రీరాములు నల్లప్ప ఓపిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో వరస కరువులతో రైతుల ఇబ్బందులు పడుతున్నటువంటి తరుణంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంటే రైతులు పంటలు పెట్టుకోవడానికి బ్యాంకులు దగ్గరికి వెళ్లి లోన్ లో రెన్యువల్ చేయడానికి అసలు మరియు అసలు మరియు వడ్డీ మొత్తం చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని చెప్పడంతో రైతుల దగ్గర డబ్బులు లేక దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారస్తుల్ని ఆశ్రయించడం ఆశ్రయిస్తున్నారు దీని ద్వారా రైతులకు అదనంగా ఆర్థిక భారం పడతా ఉంది ఇప్పటికే ఆర్థిక భారంతో పంటలు లేక పెట్టుబడును తిరిగి రాక ఇబ్బంది పడుతున్నటువంటి రైతాంగానికి ఇది చాలా అన్యాయం కాబట్టి రైతులతో వడ్డీ కట్టించుకొని రెన్యువల్ చేయాలని బ్యాంకు వారిని కోరడం జరిగింది అదేవిధంగా రీ సర్వే జరుగుతున్న క్రమంలో వన్ బి అడంగల్ ప్రభుత్వం కొన్ని ఏరియాల్లో ఇవ్వకపోవడంతో రెన్యువల్ చేయడానికి టెక్నికల్ సమస్య వస్తా ఉంది దీన్ని కూడా పరిష్కరించి రైతాంగం న్యాయం చేయాలని కోరారు. దీనికి బ్యాంక్ మేనేజర్ స్పందిస్తూ ఉన్నతాధికారులు దృష్టి తీసుకెళ్లి రైతుల పరిస్థితిని వివరించి రైతులు దగ్గర కూడా డబ్బు లేదన్న విషయం అందరికీ తెలిసిన విషయమే కాబట్టి వారికి న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేంద్ర,పెద్దన్న ఓబులేసు పుల్లన్న బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**-కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ I పంచాయతీ కార్యదర్శి యు.హిదాయతుల్లా**



రుద్రంపేట మదర్ తెరిసా కాలనీలో ని బోరుకు చేస్తున్న మరమ్మతు పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి యు. హిదాయతుల్లా తెలిపారు. సోమవారం పంచాయతీలోని మదర్ తెరిసా కాలనీలో ఉన్న బోరు లో మట్టి రాళ్లు చేరి అక్కడ నివసించే ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయం అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి పోవడంతో ఆయన మదర్ తెరిసా కాలనీలోని బోరుకు మరమ్మత్తు పనులు చేయించి అక్కడ నివసించే ప్రజలు ఎవరు వేసవికాలంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఆయన ఆదేశాల మేరకు పంచాయితీలోని మదర్ తెరిసా కాలనీలో ఉన్న బోరులో మట్టి రాళ్లు చేరి నీరు రాకపోవడంతో ఆ బోరుకు మరమ్మత్తులు చేయించి కాలనీ ప్రజలకు త్రాగునీరు అందించడంతో అక్కడ నివసించే ప్రజలు ఎమ్మెల్యే మా సమస్యను సకాలంలో గుర్తించి మాకు త్రాగునీరు అందించడం జరిగిందని కాలనీ ప్రజల అందరి తరపున ఎమ్మెల్యేకు, పంచాయతీ కార్యదర్శికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## సీఎం చంద్రబాబు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించిన పాముదాయి టిడిపి నాయకులు

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 20ప్రభాతవార్త**




సీఎం పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకుడు విశ్వనాథ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్ల ఆరోగ్యంగా జీవించాలని ఆ దేవున్ని కోరుకోవడం జరుగుతుందని సోమలదొడ్డి ఎంపీటీసీ లక్ష్మీ విశ్వనాథ్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు, నీటి సంఘం అధ్యక్షులు రామ్మోహన్, డీలర్ శ్రీనివాసులు, టిడిపి నాయకులు బాబు, రామ కృష్ణ, సాయినాథ్, రవీంద్ర, వెంకట రత్నయ్య, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, రాంబాబు తెలిపారు. ఆదివారం అనంత రూరల్ మండలం పాముదాయి గ్రామంలో ఎంపీటీసీ లక్ష్మీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సీఎం నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు సందర్భంగా ముందుగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసీఎం నారా చంద్రబాబు నాయుడు మరో పాతికేళ్లరాష్ట్రానికిసేవలుఅందించాలన్నారు. రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ఎన్నో అభివృద్ధి పనులుజరుగుతున్నాయన్నారు. అనంతరం సభ్యత్వం నమోదు చేసుకున్న టిడిపి నాయకులకు కార్యకర్తలకు సభ్యత కార్డులు పంపిణీ చేశారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**- కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ I పంచాయతీ కార్యదర్శి యు.హీదయతుల్లా**

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**



కక్కలపల్లి కాలనీ లో నూతనంగా వేస్తున్న బోరును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

అనంత రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మాది మండల కన్వీనర్, కక్కలపల్లి కాలనీ టిడిపి నాయకుడు చల్లా జయకృష్ణ, కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి యు. హీదయతుల్లా, సర్పంచ్ తేజస్విని చంద్రమోళి, తెలిపారు. సోమవారం పంచాయతీలోని ఆదర్శనగర్ లో నివసించే ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి పోవడంతో ఆమె పంచాయతీలో నివసించే ప్రజలు ఎవరు వేసవికాలంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఆయన ఆదేశాల మేరకు పంచాయితీలోని ఆదర్శనగర్ లో నూతనంగా రెండు బోరు వేసి బోరుకు పైపులైన్లు చేసి కాలనీ ప్రజలకు త్రాగునీరు అందింతుండం తో అక్కడ నివ సించే ప్రజలు ఎమ్మెల్యే మా సమస్యను సకాలంలో గుర్తించి మాకు త్రాగునీరు అందిస్తుండడంతో కాలనీ ప్రజల అందరి తరపున ఎమ్మెల్యేకు, మాజీ మండల కన్వీనర్ కు, గ్రామ సర్పంచ్ కు, పంచాయతీ కార్యదర్శి కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## అక్రమ కట్టడాలను నిర్మూలించాలని వినతి



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**యాడికి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

అక్రమ కట్టడాలను నిర్మూలించాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎంపి పుల్లయ్య సోమవారం తహశీల్దర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎంపి పుల్లయ్య మాట్లాడుతూ యాడికి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 513లో స్థానిక ఎన్‌జిఒలకు కేటాయించిన 10సెంట్ల స్థలంలో యాడికి గ్రామానికి చెందిన కొమ్మా మహేశ్వర్‌రెడ్డి ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టారన్నారు. యాడికి మండల సర్వేయర్ సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైనట్లు తన నివేదికలో పొందుపరిచి తహశీల్దార్, యాడికి పంచాయతీ ఇఒకు గతంలో వినతిపత్రాలు అందచేసినట్లు తెలిపారు. ఎన్‌జిఒలకు కేటాయించిన స్థలంలో ప్రభుత్వం పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆక్రమణదారుడు మహేశ్వర్‌రెడ్డి అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. కావునా ఈ అక్రమ కట్టడాలను నిర్మూలించి స్థలాన్ని యదావిధిగా క్రీడాకారులు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే ఎంఆర్‌పిఎస్ తరుపున ఉద్యమ బాట పట్టక తప్పదని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, సూర్యుడు, కుళ్లాయప్ప, రామాంజనేయులు, శేఖర్, పాల్గొన్నారు.

# వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందే...!

ధర్మవరంలో శాంతిర్యాలీ చేపట్టిన ముస్లింసోదరులు.

మద్దతు ప్రకటించిన సీపీఐ, సీపీఎం, వైసీపీ.

ధర్మవరం, ఏప్రిల్ 21(ప్రభాతవార్త)



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింసోదరులు

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందేని ముస్లీమతపెద్దలు, సీపీఐ, సీపీఎం, వైసీపీ నాయకులుడిమాం చేచేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారంధర్మవరం పట్టణం లో బారీ శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి సీపీఐ, సీపీఎం, వైసీపీనాయకులు, క్రైస్తవులు మద్దతు ప్రకటించారు. ఈ ర్యాలీ జామీయా మసీదునుంచి కళాజ్యోతి, ఎన్టీఆర్, గాంధీనగర్ సర్కిలీమీదుగా తిరిగి కాలేజ్ సర్కిల్ కు చేరుకున్నారు. అక్కడ పలువురు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ప్రసంగించారు. వారు మాట్లాడుతూ....కేంద్రంలోని బీజేపీ సర్కారు చేస్తున్న మతతత్వ రాజకీయాల్లో బాగంగానే ఈ వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం తీసుకువచ్చిందన్నారు. దేశంలోని మైనార్టీల హక్కులను కాలరాసే విధంగా ప్రయత్నిస్తున్నారన్నారు. ముస్లింలకు ఒక్క ఎంపీ సీటు కేటాయించని బీజేపీ ప్రభుత్వం వారి ఆస్తులను కాపాడుతామనిచెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.క్రైస్తవులు, ముస్లింల విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి బీజేపీ పన్నాగం పన్నుతోందన్నారు. ఈ సవరణ బిల్లును ఉపసంహరించుకునే వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు.అనంతరం ఆర్డీఓ మహేష్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, సీపీఐ నియోజకవర్గకార్యదర్శి మధు, రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగాలపల్లిపెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకులు ఎస్ ఎచ్ బాషా, వైసీపీ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘంలో యూనియన్ మారిన కమల్ బాషా

గోరంట్ల ఏప్రిల్ 21 ప్రభాతవార్త



యూనియన్ మారిన కమల్ భాష

సిఐటియు నుండి ఎఐటియుసి లోచేరిన గోరంట్ల మండల సిఐటియు మండల కన్వీనర్ కమల్ భాష శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ఆధ్వర్యంలో కమల్ భాషకు ఏఐటియుసి కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సీమ యాదవ్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కార్మిక సమస్యలు పరిష్కారం కోసం రాజులేని పోరాటాలు నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సురేంద్ర చౌదరి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, ఏ టియుసి జిల్లా నాయకులు రమేష్ ఏఐటిసి జిల్లా నాయకత్వం పాల్గొనడం జరిగింది.


# వైసీపీ నేతల కనుసన్నల్లో దేవాలయ భూముల దందా?

- గుత్తా పేరుతో అక్రమాలు, దేవాలయ భూముల్లో మోసం
- తహశీల్దార్‌కు గడేకల్లు గ్రామస్తుల వినతి
- పబ్లిక్ గ్రీవెన్స్ వేదికగా సమస్య వెల్లడి

విడపనకల్లు, ఏప్రిల్ 21 ప్రభాత వార్త :

గడేకల్లు గ్రామంలోని పలు దేవాలయాలకు చెందిన విలువైన భూములు గత కొంతకాలంగా కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భూములను అక్రమ వాణిజ్య కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారనే వాదనలు స్థానికంగా బలపడుతున్నాయి. ధూప దీప నైవేద్యాలకు ఉపయోగపడాల్సిన భూములు ఇప్పుడు కొందరి వ్యక్తిగత లాభాల కోసం దోపిడీకి గురవుతుండటం హిందూ సంప్రదాయాలను తీవ్రంగా అవమానించడమేనని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో గడేకల్లు గ్రామస్తులు తహశీల్దార్ చంద్ర శేఖర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, గత ఐదు సంవత్సరాలుగా గ్రామంలోని పలు దేవాలయ భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. మద్వారా నందదీపం సర్వే నెంబర్ 406లోని 22.27 ఎకరాలు, సర్వే నెంబర్ 408లోని 26.61 ఎకరాలతో పాటు మరికొన్ని మఠం భూములు కూడా అన్యాక్రాంతమయ్యాయని వారు పేర్కొన్నారు. ఆక్రమణదారులు దేవాలయానికి ఎటువంటి కౌలు చెల్లించకపోగా, ప్రభుత్వ కౌలుదారుల చట్టాన్ని సైతం ఉల్లంఘిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ భూములను కొందరు వైసీపీ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటూ, దేవాలయ భూములను వ్యాపారంగా మార్చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ఆక్రమణదారులు దేవాలయానికి నామమాత్రపు గుత్త చెల్లించి, ఆ భూములను ఇతరులకు అధిక ధరకు గుత్తకు ఇస్తున్నారని వారు తెలిపారు. దీంతో గ్రామంలోని నిరుపేద, భూమిలేని కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఈ నేపథ్యంలో, ఈ సంవత్సరం దేవాలయ భూములను మళ్లీ గుత్తకు ఇవ్వకుండా, తమ గ్రామంలోని భూమిలేని నిరుపేద కుటుంబాలకు కేటాయించాలని వారు తహశీల్దార్‌ను కోరారు. ఈ భూములను తమకు కేటాయించడం ద్వారా తమ జీవనోపాధికి తోడ్పాటు లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ గుత్తా వ్యవహారాన్ని రద్దు చేసి, నిబంధనల ప్రకారం ఈ భూములను అసలు హక్కుదారులైన పేదలకు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే దేవాలయ భూములు వ్యాపార కేంద్రాలుగా మారే ప్రమాదం తప్పదు. ఆస్తులను పరిరక్షించాల్సిన దేవాదాయ శాఖ, రెవెన్యూ విభాగాలు అన్యాయాన్ని అరికట్టకుండా ఎందుకు మోనంగా ఉంటున్నాయనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. ఇది కేవలం ఓ గ్రామ సమస్య కాదు రాష్ట్రవ్యాప్తంగా దేవాలయ ఆస్తులపై జరుగుతున్న కుట్రలకు ప్రతీక. ఈ విషయంలో గ్రామస్తుల వినతిపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి. నిరుపేదల ఈ సమస్యను తహశీల్దార్ ఉన్నతాధికారులకు తెలియజేస్తారో లేదో చూడాల్సి ఉంది.

# భవన నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి



ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 24న కలెక్టర్ కార్యాలయాల వద్ద చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంగం పెనుగొండ నియోజకవర్గ కన్వీనర్ కొండవెంకటేశ్ పిలుపునిచ్చారు. సోమవారం వాల్మీకి సర్కిల్లో భవన నిర్మాణ కార్మికుల తో కలసి కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ ధర్నాలకు పెద్ద ఎత్తున కార్మికులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు రవి, నాగరాజు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

# ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన



విద్యుత్ సమస్యలు అధికారులకు తెలుపుతున్న వినియోగదారులు

ధర్మవరం రూరల్ ఏప్రిల్ 21 ప్రభాతవార్త

పట్టణంలోని బత్తలపల్లి రోడ్ మార్కెట్‌యార్డ్ సబ్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన రావడం జరిగిందని పుట్టపర్తి ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక విద్యుత్ అదాలత్ కు రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్రావు, సాంకేతిక సభ్యులు అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరై వినియోగదారుల సమస్యల పరిష్కరించడంలో వారితో చర్చించి పరిష్కార మార్గమును చూపించడం జరిగిందని తెలిపారు. ఈప్రత్యేక విద్యుత్ అదాలతో ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని ధర్మవరం డి1, డి2, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి సెక్షన్లకు సంబంధించినటువంటి విద్యుత్ సమస్యలను ప్రత్యేక విద్యుత్ ఆదాలత్ లో డివన్ సెక్షన్ 2 డి2 సెక్షన్ 5 ధర్మవరం రూరల్ 14, బత్తలపల్లి 3 తాడిమర్రి 4,మొత్తం 28 ఫిర్యాదులు రాగా, అందులో ఐదు ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందని, మిగిలిన 23 ఫిర్యాదులను ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, వాటిని సంబంధిత అధికారుల ద్వారా విచారణ జరిపి న్యాయ పరిష్కారం చేయబడునని తెలిపారు. ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్ ద్వారా విద్యుత్ వినియోగదారులకు ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. చాలా కాలంగా పరిష్కారం కానీ కొన్ని విద్యుత్ సమస్యలు ఇక్కడ పరిష్కరించడం జరిగిందని వారు తెలిపారు. ఈ అదాలత్ కార్యక్రమంలో ఏడిఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఏవో రామస్వామి, ఏఏ ఓ రామకృష్ణ, ఏఈలు నాగభూషణం, కొండారెడ్డి, జానకి రామయ్య, శివయ్య, రవితో పాటు వినియోగదారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నలుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్ ..!

మడకశిర టౌన్ ఏప్రిల్ 21 ప్రభాతవార్త



పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చూపుతున్న సీఐ, నగేష్ బాబు

గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీస్ స్టేషన్లో సోమవారం సాయంత్రం అరెస్టు చూపారు. సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు ఖి పెనుగొండ డిఎస్పి పరవేక్షణలో మడకశిర మండల పరిధిలో ని బీమరాయన పల్లి గ్రామ సమీపంలో నలుగురితో పాటు మరి కొంతమంది వ్యక్తులు పేకాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో అర్బన్ సీఐ ఖినగేష్ బాబు , సిబ్బందితో కలిసి వెళ్లి పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు . నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరి కొంతమంది పరారీలో ఉన్నారని వారిని కూడా పట్టుకొని అరెస్టు చూపుతామన్నారు . నలుగురి వద్ద నుంచి రూ. 90,070/ నగదు, నాన్నకు సెల్ ఫోన్లు . నాలుగు ద్విచక్ర వాహనాలు . స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించి వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ నగేష్ బాబు తెలిపారు. పేకాట ఆడడం చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేకాట స్థావరం పై దాడిలో సిబ్బంది ఏఎస్ఐ ముత్యాలప్ప, హోంగార్డులు గురు, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మంజు తారక్

అమరాపురం ఏప్రిల్ 21 ప్రభాతవార్త



అధికారులతో సమావేశమైన దృశ్యం

మండల కేంద్రం లోని తహసిల్దార్ కార్యాలయం నందు ప్రజల రెవిన్యూ పరమైన సమస్యల తో పాటు ఇతర శాఖల అధికారులకు సోమవారం తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కనకనపల్లి మంజు తారక్ వివరించారు. తహసిల్దార్ కార్యాలయం నందు తహసిల్దార్ లక్ష్మీనరసింహ, పరిపాలన అధికారి ఆరాధ్య, ఎస్సై ఇషాక్ భాష, ఇరిగేషన్ అధికారి భార్గవ్ తదితరులు పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు.అలదపల్లి గ్రామపంచాయతీలోని సమస్యలను మంజూరు తారక్ అధికారులకు వివరించారు.

# జాతీయస్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికైన సోమిశెట్టి సరళ...!

ధర్మవరం, ఏప్రిల్ 21(ప్రభాతవార్త)



సోమిశెట్టి సరళ ఫైల్ ఫోటో

ధర్మవరం పట్టణానికి చెందిన జానపద గాయకురాలు సోమిశెట్టి సరళ 2025 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ఉగాది పురస్కారానికి ఎంపికైంది. తిరుపతి సిటీ చాంబర్వారు తమ 28వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్టసేవలు అందించిన వారికి 2025 ఉగాది పురస్కారాలుప్రకటించారు. కళారంగానికి తాను ఎంపికైనట్టు సోమిశెట్టి సరళ పేర్కొన్నారు. ఈనెల 27న తిరుపతిలో నిమహతి ఆడిటోరియంలో జరిగే వేడుకల్లో తిరుపతితిరుమల దేవస్థానం వారి సౌజన్యంతో ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్లు సోమిశెట్టిసరళ తెలిపారు. ఈ మేరకు తనకు తిరుపతితిరుమల దేవస్థానం నుంచి ఆహ్వానం కూడా అందిందని ఆమె పేర్కొన్నారు.

# ప్రశాంతంగా ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలు

అమరాపురం ఏప్రిల్ 21 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని అమరాపురం ఆదర్శ పాఠశాల యందు ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలను సోమవారం ఎంఈఓ వెంకటరమణ నాయక్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబులపతి ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశం కొరకు ఆన్లైన్ ద్వారా 141 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ప్రవేశ పరీక్ష యందు 132 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఓబుల పతి తెలిపారు. 9 మంది విద్యార్థులు గైరాజరైనట్లు ఆయన తెలిపారు. ఏఎస్ఐ రామాంజనేయులు పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు.

# బసవేశ్వర జయంతిను రాష్ట్ర పండుగగా గుర్తించడం అభినందనీయం

- కేంద్రం వీరశైవులను ఓబీసీలుగా గుర్తించేందుకు చర్యలు చేపట్టాలి - గవిమఠ సంస్థానం పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



సమావేశంలో పాల్గొన్న గవిమఠ సంస్థానం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి జగద్గురు డాక్టరు కరిబసవరాజేంద్రస్వామి, వీరశైవ సమాజం పెద్దలు

జగజ్యోతి, వీరశైవ ధర్మ వ్యవస్థాపకులు మహాత్మ బసవేశ్వరుని జయంతిను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగా గుర్తించి అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని గవిమఠ సంస్థానం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి జగద్గురు డాక్టరు కరిబసవరాజేంద్రస్వామి, వీరశైవ సంక్షేమ సమాజం బాధ్యులు అన్నారు. పట్టణంలోని గవిమఠ సంస్థానంలో సోమవారం వీరశైవ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా పీఠాధిపతి, ఉత్తరాధికారి ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బసవేశ్వర జయంతిను రాష్ట్ర పండుగా గుర్తించడంపట్ల రాష్ట్రంలోని వీరశైవులందరూ ప్రభుత్వానికి రుణపడి ఉంటారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇందుకోసం కృషి చేసిన రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదివరకే 2005 నుండి మహారాష్ట్ర, 2006 నుండి కర్నాటక, 2015 నుండి తెలంగాణ ప్రభుత్వాలు బసవేశ్వర జయంతిను అధికారికంగా నిర్వహిస్తున్నాయని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందన్నారు. వీరశైవుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం వీరశైవులను ఓబీసీలుగా గుర్తించేందు కృషి చేయాలన్నారు. తద్వారా భవిష్యత్తులో వీరశైవులకు విద్య, ఉద్యోగ, సమాజిక రంగాల్లో మరింత మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు.

**బసవ జయంతి వేడుకలను జయప్రదం చేయండి:**

రాష్ట్ర ప్రభుత్వం అక్షయ తృతీయ ఏప్రిల్ 30వ తేదీన బసవ జయంతిను నిర్వహించినా ఉరవకొండ పట్టణంలో మే1వతేదీన గురువారం నిర్వహించడం జరుగుతుందని ఇందులో లింగాయత ధర్మంలో ఉన్నవారందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, వీరశైవ సంక్షేమ సమాజం బాధ్యులు కోరారు. వారు మాట్లాడుతూ బసవ జయంతి వేడుకలకు పూర్తిస్థాయిలో ఏర్పాటు జరిగాయని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో తాలుకా వీరశైవ సంక్షేమ సమాజం కమిటీ సభ్యులు పాటిల్ నాగనగౌడ్, పాటిల్ నిరంజన్ గౌడ్, దేశాయి వీరేష్, మోపిడి చంద్రమౌళి, చీకలగుర్కి బొజ్జప్ప, సత్యనారాయణ, రాకెట్ల వీరేష్‌స్వామి, మల్లాపురం యోగిస్వామి, జయరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నీలకంఠ, డిష్ మల్లికార్జున, రాంమోహన్, దేశాయి ఎర్రిస్వామి, మేటి నాగరాజు, దేశాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈదురు గాలులకు నేలవాలిన విద్యుత్ స్తంభాలు, తీగలు, వృక్షాలు

- ఆకాశం మేఘావృతం అవ్వగానే మొదలవుతున్న ఈదురు గాలులు
- గత నాలుగు రోజులుగా ఉరవకొండలో ఇదే పరిస్థితి, కురవని వర్షం

ఉరవకొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



నేలకూలిన ప్రధాన విద్యుత్ తీగలున్న విద్యుత్ స్తంభం



అంగన్‌వాడీ సెంటర్ సమీపంలో కూలిపోయిన వృక్షం



సాయి ప్రగతి పాఠశాల సమీపంలో తెగిపోయిన విద్యుత్ తీగలు

భారీ ఈదురు గాలులు ఆదివారం రాత్రి ఉరవకొండ ప్రాంతంలో బీభత్సం సృష్టించాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతం కాగానే మొదలైన ఈదురు గాలులు రాత్రంతా భయాందోళనకు గురిచేయగా వర్షం జాడే లేకుండాపోయింది. దీంతో పట్టణంలోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, తీగలు, పదుల సంవత్సరాలు ఉన్న వృక్షాలు నేలవాలాయి. పట్టణంలోని తలారి వీధి మల్లేశ్వరస్వామి ఆలయం ముందు ప్రధాన రోడ్డులో 11కేవీ విద్యుత్ తీగలున్న విద్యుత్ స్తంభం కూలిపోయింది. అదే ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలోగల ఒక వృక్షం వేర్లతోపాటు నేలవాలింది. సాయి ప్రగతి పాఠశాలవద్ద విద్యుత్ తీగలు పడిపోయాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇంటి నుండి బయటకు రావడానికి కూడా జంకే పరిస్థితులు కొనసాగాయి. అంతే కాకుండా ఈదురు గాలులకు పట్టణంలోని అనేక రేకుల షెడ్లు కూలిపోయాయి.ఇంటి మిద్దెలపై ఉంచిన వస్తువులు గాలికి ఎగిరిపోయి ఆస్తినష్టం జరిగింది. ఉరవకొండ ప్రాంతంలో గత నాలుగు రోజుల నుండి సాయంత్రం వేళల్లో ఆకాశం మేఘావృతమవుతుండగా ఆ వెంటనే ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు ప్రారంభమై బీభత్సం సృష్టిస్తున్నాయి.

# ప్రవేశ పరీక్షను పర్యవేక్షించిన ఎంఈఓ

అగళి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



పరీక్ష పర్యవేక్షిస్తున్న ఎంఈఓ దృశ్యం

సోమవారం అగళి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతికి చేరుటకు ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ప్రవేశ పరీక్షను ఎంఈఓ పర్యవేక్షించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, చీఫ్ సూపరింటెండెంట్ ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు పర్యవేక్షణలో ప్రవేశ పరీక్షకు 87 మంది దరఖాస్తు చేసుకోగా 66 మంది పరీక్షకు హాజరైనట్లు, 21 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వారంలో ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలవుతాయని తెలిపారు.

# విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ, ఎఫ్‌ఎం

అగళి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ఎంఈఓ

మండలంలో ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్‌ను ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు, హెచ్ ఎం వరదరాజులు ప్రారంభించారు. డ్రైవ్‌లో భాగంగా రామాపురం గ్రామానికి వెళ్లినప్పుడు 3వ తరగతి చదువుతున్న విద్యార్థులు లవ, కుశ కవలలతో ఎంఈఓ క్లస్టర్ హెచ్‌ఎం వరదరాజులు కలిసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నడపాలని తెలియజేసినట్లు వారు తెలిపారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి

-తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఎంఎల్ ధర్నా

గుంతకల్లు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



మాట్లాడుతున్న బి.సురేష్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతున్నా ఎన్నికల ముందు వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటి దాకా అమలు చేయలేదన్నారు.18 ఏళ్ల నుండి 59 సంవత్సరాల మహిళలకు ప్రతి నెల 1500 రూపాయలు, తల్లికి వందనం కింద 15 వేలు, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి కింద 3 వేలు, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ప్రతి ఏటా 20 వేలు తదితర ప్రధాన హామీలను ఇప్పటి దాకా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. అనంతరం తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, సత్తార్, రామాంజనేయులు, రామదాస్, నారాయణ, బాష, షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై దాడులు

-నలుగురిపై కేసు నమోదు

గుంతకల్లు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ శివసాగర్ తెలిపారు. సోమవారం మండలంలోని కదిరిపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 15లీటర్ల నాటుసారాను స్వాధీనంచేసుకుని నలుగురిపై కేసునమోదుచేసినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం-2.0లో భాగంగా నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఇఎస్ శ్రీరామ్, సిబ్బంది, ఉరవకొండ ఎస్ఐ, గుంతకల్లు ఎస్ఐ సుశీలమ్మ, డిటిఎఫ్ఎస్ ఐ.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం భూ పోరాటం



సిపిఎం కార్యకర్తలు భూపోరాటం చేస్తున్న దృశ్యం

గుత్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

పేదలందరికి ఇంటి నివేశిత స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భూపోరాటం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పలు వార్డుల్లో సర్వేలు నిర్వహించి ఇళ్లు లేని పేదలను గుర్తించామన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అనంతపురం రోడ్డులోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 321లో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భూ పోరాటం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు రామకృష్ణ, రేణుక, రమేష్, మల్లేష్, మల్లికార్జున, రేవతి, కవిత, రామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు

# నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి

గుత్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



సిపిఐ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

గుత్తి మున్సి పాలిటీ పరిధిలోని నిరుపేదలకు ఇంటి స్థలాలను కేటాయించి పక్కా గృహాలను మంజూరు చేయాల ని సిపిఐ కార్యదర్శి రామదాసు డిమాం డ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో వెయ్యి మందికి పైగా నిరుపేదలను గుర్తించి ఇంటి స్థలాల వ్యవహారంపై కమీషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ మేరకు వార్డు సచివాలయం వారీగా దరఖాస్తుదారుల గురించి ఆన్‌లైన్ చేస్తామని కమీషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటరాముడు, నజీర్, మాబి, షఫీ, వెంకటేష్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

పుట్టపర్తి రూరల్ ఏప్రిల్ 21 ప్రభాతవార్త :

కదిరిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలోని లేఖన ఓం శ్రీ ప రహన ఎంపికయ్యారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. వీరి ఎంపిక పట్ల ప్రిన్సిపల్ రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ అజీమ్ భాష విద్యార్థులను అభినందించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

# గంజాయి విక్రేతలు అరెస్ట్

బత్తలపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.సోమవారం బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డు యందు జగనన్న కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్ ఆదేశాల మేరకు ముదిగుబ్బ ఇన్చార్జ్ సిఐ శివరాముడు సూచనల మేరకు తమ సిబ్బందితో దాడిచేసి జగనన్న కాలనీలో బాషా అంగడి దగ్గర గంజాయి విక్రాయిస్తున్న జ్వాలాపురానికి చెందిన ఉమ్మడి లోక్ నాథ్రెడ్డి,యాకిటిల వెంకటరమణలను అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి రెండు చిన్న చిన్న కవర్ లలో ప్యాక్ చేసి ఉన్న సుమారు 190 గ్రాముల గంజాయినీ సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని నిందితులను ఎమ్మార్వో సమక్షంలో హాజరు పరిచినట్లు తెలిపారు.

09ATP27_09ATP27.qxd 21-04-2025 PM 10:11 Page 1



# డిప్యూటీ సీఎం ఇలాఖాలో దళితుల సాంఘిక బహిష్కరణ దుర్మార్గం

**-విలేఖరులతో చాబాల గ్రామ సర్పంచ్ మల్లెల జగదీష్**

ఉరవకొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్ (ఫైల్‌ఫోటో)

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాం గ్రామంలో దళిత కుటుంబాల సాంఘిక బహిష్కరణ దుర్మార్గమైన చర్యని వజ్రకరూరు మండలం చాబాల గ్రామ సర్పంచ్ మల్లెల జగదీష్ వాపోయారు. సోమవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తుండగా ఇప్పటికీ దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేయడం క్షమించరాని నేరమన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన పెత్తందారులపై పోలీసులు కేసులు నమోదు చేయకుండా శాంతిభద్రతల పేరుతో ఇరువర్గాలను రాజీచేసి పెత్తందార్లపై ఎలాంటి చర్యలు లేకుండా రక్షించడం అన్యాయమన్నారు. గ్రామంలో దళితులకు రక్షణ కల్పించి సామాజిక బహిష్కరణ అమలు చేసిన పెత్తందార్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంకింద కేసు నమోదు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హోం, సాంఘిక సంక్షేమ మంత్రులు గ్రామాన్ని సందర్శించి బాధితులకు మనోధైర్యం కల్పించాలని కోరారు. సమస్యకు మూలమైన విద్యుత్‌ఘాతం వల్ల చనిపోయిన దళిత యువకుని కుటుంబానికి 25 లక్షల రూపాయలు పరిహారం అందించి ఆదుకోవాలని మల్లెల జగదీష్ డిమాండ్ చేశారు.

# తల్లి అనారోగ్యంతో..తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి..!

**-అనాథలైన గిరిజన అమ్మాయిలు నిర్మల బాయి, యశోధబాయి**

**-ప్రభుత్వం, స్వచ్ఛంధ సంస్థలు ఆదుకొని అండగా నిలవాలని వేడుకోలు**

ఉరవకొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



విలేఖరుల ముందు ఆవేదన వెలిబుచ్చుతున్న దివ్యాంగురాలు నిర్మలబాయి, యశోధబాయి

తల్లి సోమక్కబాయి అంగన్‌వాడీ సహాయకురాలిగా పనిచేస్తూ అనారోగ్యంతో 6 నెలల క్రితం మరణించగా ఆదివారం ఉరవకొండ శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి వెంకటేష్‌నాయక్ మృతి చెందడంతో వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాకు చెందిన ఇద్దరు యువతులు తల్లిదండ్రులు ఇరువురినీ కోల్పోయి అనాథలై ఆపన్నహస్తాల కోసం ఎదురుచూస్తున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని సామాన్య పేద కుటుంబం కావడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తల్లి మరణించిగా ఇద్దరు యువతులను తండ్రి వెంకటేష్‌నాయక్ కూలినాలి చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకొంటూ వస్తున్నాడు. దివ్యాంగురాలైన పెద్ద కుమార్తె నిర్మలబాయి కదలలేని స్థితిలో ఉండగా, చిన్న కుమార్తె యశోధబాయికు చదువుపట్లగల ఆసక్తిను గమనించి తిరుపతిలో పీజీ చదివిస్తున్నాడు. కుటుంబానికున్న ఏకైక పెద్దదిక్కు తండ్రి వెంకటేష్‌నాయక్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఇక మాకెరవరు దిక్కంటూ వారు రోధిస్తుండటం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకొంటున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బంజారా సంఘం ప్రతినిధి నంగరేర్‌నాయక్ ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగురాలైన నిర్మలబాయికు ప్రస్తుతం 4వేల రూపాయలు పింఛన్ వస్తోందని దాన్ని 15వేలకు పెంచి అందించాలని, పీజీ చదువుతున్న యశోధబాయి ఉన్నత చదువులకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంధ సంస్థలు, అభ్యుదయ సంఘాలు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించాలని కోరారు.

# భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు..న్యాయం చేయండి..!

**- తహాశీల్దార్‌కు విన్నవించిన మాదిగ దండోరా నాయకులు**

ఉరవకొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు సమస్యను వివరిస్తున్న దృశ్యం

మండలంలోని బూదగవి గ్రామం సర్వే నంబర్ 56సిలోని 3 ఎకరాల భూమిని హరిజన కులస్థుడైన వంద్రప్పకు 1978లో అప్పటి తహాశీల్దార్ డి పట్టా చేసి పాసు పుస్తకం మంజూరు చేయగా 47 సంవత్సరాలుగా వారు సాగు చేసుకొంటున్న భూమిని షేక్షానుపల్లి గ్రామం బీసీ సామాజికవర్గానికి చెందిన ఒక వ్యక్తి మరికొందరూ అది రిజిస్టర్ భూమని చెబుతూ ఆక్రమించుకోవాలని చూస్తున్నారని న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ డివిజినల్ సభ్యులు కౌకుంట్ల రవి, మాదిగ దండోరా తాలుకా అధ్యక్షులు రాంపురం చెన్నప్ప, డివిజినల్ అధ్యక్షులు ఎం.రామాంజినేయులు, తాలుకా ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల సురేష్, హరిజన రామాంజినేయులు, బి.గోపాల్ కోరారు. సోమవారం వారు మండల తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు భూమి విషయం విచారణకురాగా గ్రామస్థులు, భూమికి చుట్టుప్రక్కల భూములు కల్గినవారు అది వంద్రప్పకు చెందిన భూమని వారే సాగులో ఉన్నారని చెప్పారన్నారు. ఈ విషయమై వెంటనే స్పందించి న్యాయం చేయాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

# 25న ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాల బహిరంగ వేలం

**- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉరవకొండ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర**

ఉరవకొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర

ఈనెల 25వతేదీన శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌వద్ద ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడి ప్రభుత్వానికి జప్తు కాబడిన వివిధ వాహనాలను బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఉరవకొండ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర తెలిపారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అనంతపురం డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 6 ద్విచక్ర వాహనాలతోపాటు ఒక టాటా సుమో వాహనాన్ని వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు 25వ తేదీ ఉదయం 10 గంటలకు ఉరవకొండ ఎక్సైజ్ స్టేషన్‌వద్ద ఆధార్ కాపీ, పాన్ కార్డు కాపీతో హాజరై 3,000 రూపాయలు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొన వచ్చుని ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర వివరించారు.

# రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించాలి

**-తాగునీటి సమస్య పరిష్కరించి నీటి నాణ్యత పరీక్షలు జరుపాలి**

**-పీజీఆర్ఎస్‌లో తహాశీల్దార్‌కు విన్నవించిన జనసేన పార్టీ నాయకులు**

ఉరవకొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. పట్టణంలోని మండల తహాశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీఆర్‌జీఎస్‌లో వారు ఈ మేరకు తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుండి ఎన్ని పిర్యాదులు వచ్చాయో, ఇప్పటివరకు ఎన్నింటిని పరిష్కరించారో అధికారులు వెల్లడించాలన్నారు. మండలంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని పరిష్కరించాలన్నారు. ఏడాదికొకసారి నిర్వహించాల్సిన నీటి నాణ్యత పరీక్షలు రెండు సంవత్సరాలు దాటినా ఇంకా అనేక పంచాయతీల్లో నిర్వహించలేదన్నారు. మండలంలోని ఎన్ని గ్రామాల్లో ప్రభుత్వ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారో, ఇంకా ఎన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయాల్సి ఉందో వెల్లడించాలన్నారు. వేసవిలో పశువులకు నీటి ఎద్దడి లేకుండా చేయడం కోసం ఉపాధిహామీ పథకం ద్వారా దాదాపు 60 కోట్ల రూపాయలు వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 15,000 పశువుల నీటి తొట్టెల నిర్మాణాన్ని ఏప్రిల్ నెల ఆఖరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి పంచాయతీకు కనీసం ఒక్క నీటి తొట్టె ఏర్పాటు చేయబడుతోందని ఇప్పటివరకూ ఉరవకొండ మండలంలోని ఎన్ని పంచాయతీల్లో నీటి తొట్టెల నిర్మాణం పూర్తి అయింది, మిగిలిన పంచాయతీల్లో ఎంతకాలంలో పూర్తి చేస్తారో తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దేవేంద్ర, భోగేష్, రఘు, మణి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

# అనాధలైన గిరిజన అమ్మాయిలను ప్రభుత్వం ఆదుకోవాలి

**- జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.కె.ధర్మసింగ్ నాయక్**

ఉరవకొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



అనాధలైన అమ్మాయిలను పరామర్శిస్తున్న జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.కె.ధర్మసింగ్ నాయక్

తల్లిదండ్రుల మృతితో అనాధలైన గిరిజన అమ్మాయిలు నిర్మలబాయి, యశోధబాయిను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.కె.ధర్మసింగ్ నాయక్ కోరారు. సోమవారం ఆయన వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలో వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్.కె.ధర్మసింగ్ నాయక్ మాట్లాడుతూ 6 నెలల క్రితం అనారోగ్యంతో తల్లి సోమక్కబాయి మృతి చెందడం, రోడ్డు ప్రమాదంలో తండ్రి వెంకటేష్‌నాయక్ మరణించడం తమను తీవ్రంగా కలిచివేస్తోందన్నారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. దివ్యాంగురాలైన నిర్మలబాయికు ప్రస్తుతం 4వేల రూపాయలు మాత్రమే పింఛన్ వస్తోందని దాన్ని 15వేల రూపాయలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్, పి.ఢాక్యనాయక్, ఆర్.ఎం.వెంకటేష్‌నాయక్, విద్యా కమిటీ మాజీ ఛైర్మెన్ స్వామినాయక్, రమావత్ దేవులా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ధర్మవరం రూరల్ ఏప్రిల్ 21 ప్రభాతవార్త



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న తెదేపా నాయకులు

వంండ్ల పరిధిలోని నాగలూరు గ్రామానికి చెందిన అనంతమ్మ కి 87,938 రూపాయిలు విలువగల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను నియోజక వర్గ క్లస్టర్ ఇన్చార్జి మహేష్ చౌదరి పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది అభాగ్యులు సకాలంలో చికిత్సపొందలేక ప్రైవేట్ ఆస్పత్రిలలో అప్పులుచేసి, ఖర్చు పెట్టుకున్న బాధిత కుటుంబాలకు సీఎం ఆర్ చెక్కులు కొండంత అండగా లబ్ధిదారులకు ఉపయోగపడుతున్నాయని ఆయన అన్నారు. పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి విజయ్ సారది, జంగం నర్షింహులు నాలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్వానపత్రికలను విడుదల చేసిన ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు గోవిందరాజు

మడకశిర ఏప్రిల్ 21 ప్రభాతవార్త;



ఆహ్వానపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

మడకశిర నియోజకవర్గం రోళ్ల మండలంలోని కొత్తపాళ్యం గ్రామంలో వెలసిన శ్రీదేవి శ్రీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ 12వ వార్షికోత్సవ ఆహ్వానపత్రికలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు జి.గోవిందరాజు సోమవారం శ్రీదేవి శ్రీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం విడుదల చేశారు. మడకశిర పట్టణానికి సుమారు 18 కిలోమీటర్ల దూరంలో కొత్తపాళ్యం నివాసి జి.గోవిందరాజులు సొంత నిధులతో 2009లో ఈదేవాలయ నిర్మాణాన్ని శ్రావణమాసంలో ప్రారంభించి ఆదేవదేవుని ఆశీర్వాదాలతో దేవాలయ నిర్మాణం పనులు 2013 మే నెలలో పూర్తిచేశారు. ఈ దేవాలయం నిర్మించినప్పటినుండి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని ప్రత్యేకంగా దర్శించుకొంటున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు జి.గోవిందరాజులు దేవాలయ నిర్మాణంతో పాటు కళ్యాణమంటపాన్ని కూడా అప్పట్లోనే నిర్మించారు. ఈదేవాలయం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం భక్తుల సందర్శనంతో నిత్యపూజలతో ఎంతో శోభాయమానంగా విరాజిల్లుతూ నేడు 12వ సంవత్సరంలోకి అడుగితున్న సందర్భంగా శ్రీదేవి శ్రీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి పుష్కర వార్షికోత్సవ వేడులకను ఘనంగా జరుపు సంకల్పంతో సోమవారం స్వామి వారి సన్నిధిలో ఆహ్వాన పత్రికలను ఆయన విడుదల చేశారు.

# కానిస్టేబుల్ పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు...!

ధర్మవరం, ఏప్రిల్ 21(ప్రభాతవార్త)

ధర్మవరం పట్టణంలోని కదిరిగేటు సమీపంలో ఆదివారం రాత్రి ఓ కానిస్టేబుల్ పై ఎగ్ రైస్ బండి నడుపుకునేరాజు దాడిచేయడంతో కేసు నమోదు చేసినట్టు సీఐ రెడ్డప్ప తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు... కదిరిగేటు వద్ద రాజు అనే వ్యక్తి ఎగ్ రైస్, ఎగ్ ఫ్రైలు వేసుకుంటున్నాడు. ఈ క్రమంలో టూటౌన్ పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుల్ విశ్వనాథ్ ఆదివారం రాత్రి 1030గంటల సమయంలో అక్కడికి వెళ్లాడు. రాత్రి సమయం దాటి పోయింది బంద్ చేయాలని కానిస్టేబుల్ చెప్పాడు. కానీ రాజు బంద్ చేయకపోగా కానిస్టేబుల్ తో గొడవ పెట్టుకున్నాడు.ఆ గొడవ కాస్త ముదిరి రాజు, అతనికి మద్దతుగా మరికొందరు కానిస్టేబుల్ పై దాడికి దిగారు. దీంతో కానిస్టేబుల్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ రెడ్డెప్ప తెలిపారు.

# ఉన్నత పాఠశాలకు బీరువా వితరణ

గుత్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



బీరువా అందచేసిన దృశ్యం

మండలంలోని బేతాపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఆయన తల్లి రాధాలు 15 వేల రూపాయల విలువ చేసే బీరువాను వితరణ చేశారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎల్వి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు రామకృష్ణ, సులోచన, శివ, ప్రసాద్, సుజాత, సాధన, పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్

గుత్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త



కమీషనర్‌కు వినతిపత్రాలు అందచేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యల పరిష్కారానికి కమీషనర్ జబ్బార్ మియాకు వినతి పత్రాను అందచేశారు. రోడ్డు ఆక్రమణ జరుగుతుందని, తమ ఇంటికి కొలతలు రీ సర్వే చేయించాలని, అదేవిధంగా ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, తదితర సమస్యల గురించి పలువురు వినతిపత్రాలను అందచేశారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సభకు ఆహ్వానం

కణేకల్లు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:



ఆత్మీయ సమ్మేళనంకు ఆహ్వానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఏప్రిల్ 23వ తేదీ బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కణేకల్లులో నిర్వహించబోయే పూర్వ విద్యార్థుల సమ్మేళన సభ మరియు సరస్వతి దేవి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు 1996-97 పూర్వ విద్యార్థుల బృందంచే ఘనంగా నిర్వహించబడుతోందని కావున 1996-97 విద్యా సంవత్సరంలో చదివిన మిత్రులు అందరూ కుటుంబ సమేతంగా వచ్చి మనం చదివిన పాఠశాల రుణం తీర్చుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని హృదయపూర్వకంగా పూర్వ విద్యార్థులకు విద్యను బోధించిన ఆధ్యాపకులను మరియు తోటి విద్యార్థులను సాధారణంగా ఆహ్వానిస్తున్నారు.

# కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:



పట్టుబడిన మద్యంను చూపుతున్న పోలీసులు

కర్ణాటక నుండి అక్రమంగా తరలించి విక్రయిస్తున్న కర్ణాటక మద్యంను పట్టుకొని స్వాదీనం చేసుకున్నట్లు సీఐ మహేష్ కుమార్ తెలిపారు. డిప్యూటి కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ అనంతపురం వారి ఆదేశాల మేరకు కర్ణాటక అక్రమ మద్యం పై దాడులు నిర్వహించి సోమవారం సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని గ్రామదట్ల గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న తలారి శారదమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుండి 32కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాదీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆమె పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా కర్ణాటక మద్యంను తరలించినా, విక్రయించినా, నిలువ ఉంచినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై పవన్, సిబ్బంది సోము, హరి, లాలు, కవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చిక్కనేశ్వర స్వామి భజనల్లో పాల్గొన్న పాటిల్ బ్రహ్మానందరెడ్డి

కణేకల్లు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:



స్వామివారి భజన కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మానందరెడ్డి

కణేకల్లు మండల కేంద్రంలోని కలియుగ దైవమైన శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవాలయం నందు ప్రతి సోమవారం వైసిపి కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి మరియు మాల్యాం గ్రామస్థుల ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీన్ట కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి ప్రతి సోమవారం తప్పకుండా భజన కార్యక్రమంలో పాల్గొని స్వామి పాటలు పాడుతూ శ్రీ చిక్కనేశ్వరస్వామి సేవలు తరిస్తున్నాడు. సోమవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు అయిన గంగపూజ, పంచామృత అభిషేకం, రుద్రాబిషేకం, ఆకు పూజ తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వీరేష్ స్వామి తెలిపారు.

# వివిధ సంఘ సంస్థల పోరాట ఫలితమే పావగడకు తుంగభద్ర నీరు

**- సూదులకుంట శివప్రసాద్**



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

పావగడ తాలూ కాకు తుంగభద్ర నీరు వివిధ సంఘ సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు కలిసి 2007లో దాదాపు 35 రోజులపాటు అనేక రకాలుగా పోరా టాలు చేయడం ద్వారానే తాలూకాకు తుంగభద్ర నీటిని ప్రభుత్వం అందించిందని ఇది ఆ పోరాట ఫలితమేనని పావగడ తాలూకా సమగ్ర నీరు పోరాట వేదిక అధ్యక్షులు సూదులకుంట శివప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎస్కె సముదాయ భవనంలో పావగడ తాలూకా సమగ్ర నీరు పోరాట వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోరాట యోధులకు సన్మాన కార్యక్రమం లో వారు పాల్గొని మాట్లాడారు. పావగడ తాలూకాలోని ప్రజలు ఎన్నో దశాబ్దాల కాలంగా త్రాగునీటి సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఫ్లోరైడ్ నీటితో ఇక్కడ ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. తాలూకాలోని సమస్యలను పరిష్కరించుకోవాలంటే పోరాటా ల ద్వారానే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ పోరాట పటిమను అలవర్చుకోవా లని దానితోనే సమస్యలు పరిష్కారం జరుగుతుందని పిలుపునిచ్చారు. ఎత్తిన హులె, హేమావతి నీటి పనులు మందకొడిగా సాగుతున్నాయని వాటిని వేగవంతం చేసి పావగడ తాలూకాకు చెరువులకు నీరు వచ్చేంతవరకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మందికిపైగా పోరాటయోధులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ జనార్ధన స్వామి, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, ఆర్సి అంజనప్ప, గోవిందప్ప, సొగడు వెంకటేష్, శివకుమార్ సాకేలా, శ్రీరామ్ సేన రామాంజనేయ, జి.టి.గిరీష్, రైతు సంఘం నాయకులు నర్సింహారెడ్డి, కృష్ణారావు, పూజారప్ప, రఘు, తిప్పేస్వామి, రంగణ్ణ, వివిధ సంఘ సంస్థల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల 25లోగా ఈకేవైసీ చేయించుకోండి

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:

రేషన్ కార్డులో ఉన్న ప్రతి లబ్దిదారుడు ఈ నెల 25వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహాసీల్దార్ నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటోతేదీన బియ్యం పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన తెలిపారు. అర్బన్ రరూల్ ప్రాంతంలో 30వేల కార్డులను 99,054మంది ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే 91వేల మంది ఈకేవైసీ చేయించుకుంటే, మిగిలిన 8వేల మంది ఈ నెల 25లోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన సూచించారు.

# దేవాలయానికి ఎస్‌బిఐ కురుబ మంజు రూ.15వేలు విరాళం



విరాళం అందజేస్తున్న ఎస్‌బిఐ కురుబ మంజునాథ్

అగళి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

మండల పరిధిలోని హనుమనపల్లి పురాతన దేవాలయాన్ని తొలగించి నూతన ఈశ్వరుని దేవాలయ నిర్మాణానికి బొమ్మాసనపల్లికి చెందిన ఎస్‌బిఐ కురుబ మంజు రూ.15వేలు విరాళాన్ని గ్రామస్తులకు అందజేశారు. ఆ గ్రామ గౌడ్ గోవిందప్ప గ్రామస్తులకు దేవాలయం ముందే, నూతన శివుని దేవాలయ నిర్మాణానికి రూ.15వేలు నగదును విరాళంగా అందజేశారు. గత మూడు రోజులుగా ఇదే కురుబ ఎస్‌బిఐ మంజు బొమ్మాసన పల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని నిర్వహించారు. రూ.50వేలుమొదటి బహుమతిని ప్రకటించి విజేత అగళి జట్టుకు ఆదివారం రాత్రి మెమెంటోతోపాటు, మెడల్స్, నగదు బహుమతిని అందజేశారు. ఎస్‌బిఐలో పని చేస్తూ అటు క్రీడా పరంగా, ఇటు సామాజిక అంశాల్లో తనవంతు సాయాన్ని అందజేస్తూ మంజునాథ్ ముందుకెళ్తున్నారు. ఇలా మంజునాథ్ సహాయం చేయడం చూసి ఆదర్శంగా తీసుకుని ఇంకొందరు ముందుకు వస్తే వెనుకబడిన గ్రామాలు, అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది. చిన్న వయస్సులోనే ఇలా సహాయ సహకారాలు అందించి పలువురి మంజునాథ్ పొందుతున్నారు. బహుమతిని అందజేస్తున్న బొమ్మాసన గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, నందీష్, హనుమనపల్లి రఘు, ఎంపిటిసి చంద్రప్ప, రంగనాథ్, బాలకృష్ణ, జగన్నాథ్, మాజీ ఉప సర్పంచు రంగనాథ్ తదితరులు ఉన్నారు.

# రబీ జొన్నలు కొనుగోలు చేయాలంటూ కన్నడనాడు రైతుసంఘం ధర్నా




డి.సి. కార్యాలయంలో ప్రతిఘటన చేస్తున్న రైతులు

బళ్లారి, ఏప్రిల్21, ప్రభాతవార్త;

రబీ సీజన్‌లో రైతులు పండించిన జొన్నలను జిల్లా యంత్రాంగం తక్షణమే ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కన్నడనాడు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారంనాడు డి.సి. కార్యాలయంలో ప్రతిఘటన చేపట్టారు. రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెణసిన ఈశ్వరప్ప తదితర పదాధికారులు జిల్లాధికారి కార్యాలయం అధికారికి వినతి పత్రం సమర్పించి, రైతుల నుంచి జొన్నల కొనుగోలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బళ్లారి జిల్లా, తాలూకాలో అధికంగా రైతులు జొన్నలను పండించారని, అయితే ఇప్పటివరకు 382 మంది రైతుల నుంచి మాత్రమే జొన్నలు కొనుగోలు చేసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈనెల 15వ తేదీన ఏపీఎంసీ యార్డు ఆవరణలో ప్రతిఘటన చేసినప్పుడు అసిస్టెంట్ కమిషనర్ వచ్చి అందరి రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వపు మద్దతు ధరతో చట్ట వ్యవస్థను తిరస్కరించి రిజిస్ట్రేషన్ చేసుకున్న జాబితాను రద్దు చేసి కొత్తగా రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిఘటనలో రైతు నాయకులు విశ్వనాథ్, చెన్నప్ప, నాగరాజ్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

